క్లుప్తంగా

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



కొవ్వూరు న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

తాళ్లపూడి(కొవ్వూరు): తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కొవ్వూరు ఆధ్వర్యంలో కొవ్వూరులోని శ్రీ అభ్యాస స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు ఎం.నాగలక్ష్మి, ఎం. రఘురామ్, ఎస్.శ్రీనివాసరావు, ఎంశ్రీ వల్లీ, ఎం.శిరీష పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త తొలగింపు



అన్నవరప్పాడులో పొక్లెయిన్‌తో రోడ్డు పక్కన చెత్త తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: 'పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో శుక్రవారం సాక్షిలో వెలువడి కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. అన్నవరప్పాడులో రోడ్డును కమ్మేసిన చెత్తను అధికారులు పొక్లెయిన్‌తో తొలగించి తరలించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చెత్త చెదారాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఈఓపీఆర్డీ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. ఎక్కడ చెత్త ఉన్నా అందుకు కార్యదర్శులదే బాధ్యత అని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవ హరించవద్దని ఆయన హెచ్చరించారు.

ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి(కొవ్వూరు): నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరులో సంవత్సర కాలంలో మూడోసారి జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు సుమారు 1,200 మంది ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 400 నుంచి 500 మంది ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. 16 కంపెనీలు ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ప్రిన్సిపాల్ సునీత, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు మురళి, పావని, కోఆర్డినేటర్ సస్య, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై కేసు

తాళ్లపూడి: మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు కనబడడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు శుక్రవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

దేవరపల్లి: దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రు అనీల్ తండ్రి గౌరీపట్నం గ్రామ మాజీ సర్పంచ్ ఆంద్రు వెంకటేశ్వరరావు (82) అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. గౌరీపట్నంలోని స్వగృహానికి తీసుకువచ్చిన ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ కేఎస్ జవహర్, పలువురు టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. 1981 నుంచి 1987 వరకు వెంకటేశ్వరరావు గ్రామ సర్పంచ్‌గా పనిచేసి, గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

ఆధునిక సాగుతో అధిక దిగుబడి

- ట్రేలలో మడులు కట్టే విధానమే మేలు
- ఊడ్పు యంత్రంతో నాట్లు వేస్తే సమయం ఆదా
- పెట్టుబడి వ్యయం తగ్గి రైతులకు మేలు



పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

పెరవలి: వరి సాగులో రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ పెట్టుబడి వ్యయం తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టిన కొందరు రైతులు ఆకుమడులు వేయకుండా ట్రేలలో, డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుకునేందుకు సమాయత్తమయ్యారు. ఈ విధానం ద్వారా ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ రావడంతోపాటు సమయం ఆదా అవుతుందని కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ తెలిపారు. మాన్యువల్ సీడింగ్ యంత్రంతో ఆకుమడులు కట్టుకుంటే సమయం ఆదాతో పాటు ఖర్చు తగ్గుతుందని ఆయన తెలిపారు. సాధారణ ఆకుమడి నాట్లు వేయడానికి 25 నుంచి 30 రోజులు సమయం పడితే ఈ ట్రేలలో విత్తనాలు వేసి పెంచిన నారుమడి నాట్లు వేయడానికి కేవలం 14 రోజుల వయస్సు సరిపోతుందని తెలిపారు. ఈ రెండు పద్ధతుల్లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా యంత్రంతో విత్తనాలు వేసుకోవడమే సరైన విధానమని ఆయన అన్నారు.



ఉసులుమర్రులో యంత్రంతో ట్రేలలో విత్తనాలు వేస్తున్న రైతులు



ఉసులుమర్రులో యంత్రంతో నాట్లు వేస్తున్న రైతు

ఆకుమడులు సిద్ధం చేసే విధానం

విత్తనం విత్తే యంత్రంతో మొలకెత్తిన విత్తనాలను ట్రేలలో వేయాలి. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఇందుకోసం మొదట నారుమడి దమ్ము చేసుకోవాలి. ఎకరం చేనుకి 60 నుంచి 70 ట్రేలు అవసరమవుతాయి. ఈ ట్రేలను ఆకుమడిలో ఉంచి మట్టితో నింపుకోవాలి. ఈ ట్రేలకు ఇరువైపులా విత్తనం విత్తే యంత్రం వెళ్లేందుకు ప్రత్యేకంగా తయారుచేసిన ఇనుప కమ్మెలను ఏర్పాటుచేసి దానిపై ఈ యంత్రాన్ని అమర్చి అందులో విత్తనాలు వేసి సమంగా తీసుకువెళ్తే విత్తనాలు ట్రేలలో పడతాయి. ఈ ట్రేలలో వేసిన మడులకు ఎటువంటి ఎరువులను వినియోగించనవసరం లేదు. ఆకుమడిలో ఎటువంటి లోపాలున్నా అందుకు తగు మోతాదులో 70 ట్రేలకు కాంప్లెక్స్ అర కిలో, యూరియా పావుకిలో, పొటాష్ పావుకిలో మడులపై చల్లాలి. ఈ ఆకుమడిని 14రోజుల తర్వాత తీసి ఊడ్పు యంత్రంతో నాట్లు వేసుకోవచ్చు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి చదరపు మీటరుకు 33 మానులు వేయాల్సి ఉంటుంది. ఊడ్పు యంత్రంతో వేస్తే నాట్లు సక్రమంగా పడతాయని ఏడీఏ తెలిపారు.

సాధారణ ఆకుమడి

ఖరీఫ్ సాగులో వరినాట్లు జూలై 15 నాటికి పూర్తికావాల్సి ఉంది. ఆకుమడులు వారం రోజుల్లోపు వేయాలని, అదును దాటితే ఆకుమడుల బదులు ఊడ్పు యంత్రాలతో ఖరీఫ్ సాగు చేయాల్సి ఉంటుంది. సాధారణ ఆకుమడి వేయాలంటే ఐదు సెంట్ల నారుమడికి 30 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. దమ్ము అనంతరం మడిని నునుపు చేసి తరువాత గాడులు ఏర్పాటు చేయాలి. అనంతరం నీటిని నిలువ ఉంచి విత్తనాలు చల్లాలి.

యాజమాన్య పద్ధతులు

ఆకుమడికి దమ్ముచేసే సమయంలో 8 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 4 కిలోల యూరియా, 2 కిలోల పొటాష్ వేయాలి. విత్తనాలు చల్లిన 3వ రోజున కలుపు నివారణ కోసం ప్రిటిల్లాక్లోర్ 2 మిల్లీలీటర్ల మందులో ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. మడి వేసిన 12 రోజులకు 4 కిలోల యూరియా వేయాలి. ఈ నారుమడి 25 నుంచి 30 రోజుల వయస్సులో నాట్లు వేసుకోవాలి. ముల్లపురుగు ఎక్కువగా కనిపిస్తే మడి వేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 5 మిల్లీలీటర్ల వేపనూనెను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ వేపనూనె ముల్లపురుగు, గుడ్డుముద్దలను నాశనం చేస్తుంది. ఆకును తీయడానికి వారం రోజుల ముందు త్రీజీ గుళికలు కిలోన్నర వేయాలి. ఇలా ఆకుమడి వేసి వరినాట్లు వేయడానికి ఎకరానికి రూ.8వేలు ఖర్చు అవుతుంది. అదే ఊడ్పు యంత్రంతో ట్రేలలో ఆకుమడి వేసి వరినాట్లు వేస్తే కేవలం రూ.5,200 నుంచి రూ.6వేల ఖర్చు మాత్రమే అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ ఆకుమడుల కన్నా యంత్రాలతో సాగుచేస్తేనే ఎటువంటి అవరోధాలు లేకుండా పంట పండించుకోవచ్చని ఏడీఏ తెలిపారు.

ధాన్యం ఊకతో అవస్థలు పడుతున్నాం



దేవరపల్లిలోని రైస్‌మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

దేవరపల్లి: ఇళ్లను ముంచెత్తుతున్న ధాన్యం ఊకను తక్షణం అరికట్టి, తమ ఆరోగ్యాలను కాపాడాలంటూ స్థానిక వరలక్ష్మి రైస్‌మిల్లు వద్ద శనివారం సాయంత్రం మహిళలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జాజి మొగ్గల దుర్గ, గుంటూరు లక్ష్మి, బోళ్లపాటి నాగలక్ష్మి, కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఇళ్ల మధ్య రైస్‌మిల్లు ఉండడంతో ఊక ఎగిసిపడుతోందన్నారు. సుమారు ఐదేళ్లుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇంటి డాబాలపై ఊక పేరుకుపోతోందని, దాని వల్ల దురదలు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని మిల్లు యజమానికి చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో మండల పరిషత్ అధికారి, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. కాగా.. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిశోర్‌ను వివరణ కోరగా ప్రజల నుంచి ఫిర్యాదు రాలేదన్నారు.

ధాన్యం సొమ్ము కోసం ఆందోళన

ఉండ్రాజవరం: సార్వా వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో చేతిలో డబ్బులు లేక ప్రభుత్వం నుంచి ధాన్యం సొమ్ము కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యం విక్రయించి నెలలు గడిచినా సొమ్ము చేతికి అందక అప్పులతో సతమతమవుతున్నామని రైతులు అన్నారు. గత మే నెలలో విక్రయించిన ధాన్యానికి ఇప్పటి వరకూ సొమ్ము జమ చేయలేదని, దీనిపై పాలకులు, అధికారులు స్పందించాలని కోరుతూ ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం సొమ్ము అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ధాన్యం సొమ్ము జమ కాకపోవడంతో గత రబీ సీజన్‌లో వ్యవసాయ పెట్టుబడులు, పురుగుల మందులకు, కోత యంత్రాలకు, ట్రాక్టర్లు దమ్ము చేసినందుకు వారికి చెల్లించడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నారుమడులు వేయడానికి, ఊడ్పులకు చేపట్టేందుకు కూలీలకు సొమ్ము ఇవ్వడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సమస్యను ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు.



ఉండ్రాజవరంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం

- కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కొవ్వూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని దీన్ని ప్రశ్నిస్తూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 3 గంటలకు కొవ్వూరు రైల్వే స్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జిల్లాస్థాయిలో మొదటిగా ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తిప్పల గురుమూర్తి హాజరుకానున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను, మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోడూరి శివరామకృష్ణ, తాళ్లపూడి మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు జుట్టా ఏడుకొండలు, ఉప్పులూరి సూరిబాబు, సుంకర సత్యనారాయణ, దాకే రాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో ఎరువులు వినియోగించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో, రైతులు వరి దిగుబడులు పెంచుకునేందుకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను వినియోగించాలని ఏరువాక కోఆర్డినేటర్ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు సూచించారు. కొవ్వూరు మండలంలోని పసివేదల రంగరాయ విశాల సహకార పరపతి సంఘం వద్ద అంతర్జాతీయ సహకార సంవత్సరం ఖరీఫ్ 2025 వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు మాట్లాడుతూ ఎరువులు అధికంగా వినియోగిస్తే పంటలకు నష్టం కలుగుతుందని, మట్టిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. వరి సాగులో ఒకే రకం స్వర్ణ వెరైటీ కాకుండా ఎంటీయూ 1318 వంటి రకాలను సాగు చేయాలని చెప్పారు. 1318 రకం వరి సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని, వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదులను నిర్ణయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాతో సరైన మోతాదులో మాత్రమే ఎరువులు వేయాలని చెప్పారు. ఎరువులు, కలుపు మందు కలిపి పిచికారీ చేయవద్దని తెలిపారు.



పసివేదల సహకార సంఘం వద్ద మాట్లాడుతున్న ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు

నీమ్ కోటెడ్ యూరియాతో అధిక మేలు

సహాయ సంచాలకులు జయరామలక్ష్మి మాట్లాడుతూ రైతులు శాస్త్రీయంగా వ్యవసాయం చేయడం ద్వారా దిగుబడులు పెరిగి ఆదాయం మెరుగవుతుందని అన్నారు. మండల వ్యవసాయ అధికారి గంగాధరరావు మాట్లాడుతూ యూరియా వాడకంలో తూర్పు గోదావరి జిల్లా మూడవ స్థానంలో ఉందని, ఫలితంగా కేంద్ర ప్రభుత్వంపై సబ్సిడీల భారం పెరుగుతోందని, ఒక్క యూరియా బ్యాగ్‌పై రూ.1,525 సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. నీమ్ కోటెడ్ యూరియా వాడకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. నకిలీ ఎరువుల వాడకం వల్ల పంట దిగుబడి తగ్గడమే కాకుండా, భూ సారం దెబ్బతింటుందని హెచ్చరించారు. సహకార సంఘాల వద్ద నుంచి నాణ్యమైన ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి జగన్నాథరెడ్డి, సంఘ సీఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వేగవంతం

తాళ్లపూడి(కొవ్వూరు): కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు గుర్తించి లోక్ అదాలత్‌లో వేగవంతంగా పరిష్కరిస్తామని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. జులై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై కొవ్వూరులోని జిల్లా కోర్టు హాల్లో శనివారం 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కక్షిదారులను ఒప్పించి పెండింగ్ కేసులను రాజీ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కొవ్వూరు కోర్టుల్లో ఎన్ని క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, పోలీస్‌స్టేషన్ల వారీగా ఎన్ని కేసులు రాజీకి గుర్తించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలు సీఐలు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి మండలాల ఎస్సైలు పాల్గొన్నారు .



కొవ్వూరు జిల్లా కోర్టు హాల్లో మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

చాగల్లు: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. చాగల్లుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మానూరి వెంకటరావు 3వ వర్ధంతి సందర్భంగా శనివారం చాగల్లులో వెంకటరావు చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం అభివృద్ధికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు సహకారంతో కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో చాగల్లు మండల అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్, నాయకులు బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, కరుటూరి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఘన పారాయణ తపస్సు వంటిదే..



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారామచంద్ర ఘనపాఠి

రాజమహేంద్రవరం రూరల్: సంపూర్ణ ఘన పారాయణను శ్రవణం చేయడమే తపస్సుగా భావించిన యతీశ్వరులెందరో ఉన్నారని శ్రీ దత్తాత్రేయ వేద విద్యా గురుకులం వ్యవస్థాపకుడు, వేదార్థ చూడామణి గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠి అన్నారు. కొంతమూరులో ఆయన నెలకొల్పిన గురుకులం రజతోత్సవాల్లో భాగంగా, సంపూర్ణ కృష్ణయజుర్వేద ఘనపారాయణ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగద్గురు ఆదిశంకర భగవత్పాదులు కూడా కృష్ణ యజుర్వేద ఘనపాఠి విద్వంశంలో జన్మించారని అన్నారు. ఈ పారాయణ చేసినా, విన్నా, ఐహిక, ఆముష్మిక శుభాలు కలుగుతాయని వివరించారు. రాజమహేంద్రవరంలో సుమారు 67 ఏళ్ల తరువాత పవిత్ర గోదావరి తీరాన ఉన్న ఈ గురుకులం రజతోత్సవ సంవత్సరంలో ఘనపారాయణ జరగడం ముదావహమని అన్నారు. వేదమాత ఆశీస్సులతో ఈ కార్యక్రమం జయప్రదం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇదే పాఠశాలలో వేదవిద్యను అభ్యసించిన ఘనపాఠులు ఘనపారాయణ ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, వేద పండితులు దువ్వూరి సూర్యప్రకాశావధానులు, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, నగర ప్రముఖులు దాట్ల బుచ్చి వేంకటపతిరాజు, దాట్ల భాస్కరరాజు, గురుకులం అధ్యక్షుడు పాలెపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఘనపారాయణ వచ్చే నెల 27వ తేదీ వరకూ కొనసాగుతుంది.

మెప్మా స్టాల్ ప్రారంభం



మెప్మా స్టాల్‌లో వస్తువులు విక్రయిస్తున్న మహిళలు

నిడదవోలు : స్థానిక సంత మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో శనివారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ స్టాల్‌లో ప్రదర్శించి, విక్రయించారు. ఈ ప్రదర్శనలో పట్టణంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఏ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత, సింధుమాధవి, ఆర్పీలు, పట్టణ సమాఖ్య మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు : స్థానిక సంజీవయ్యనగర్‌లో ఏరియాలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డ్రెయినేజీపై నిర్మించిన వంతెన తొలగింపు



దేవరపల్లిలో ఇసుకవాగు డ్రెయినేజీపై అక్రమంగా నిర్మించిన వంతెనను తొలగిస్తున్న అధికారులు

దేవరపల్లి: స్థానిక ఇసుక వాగు డ్రెయినేజీపై అక్రమంగా నిర్మించిన వంతెనను అధికారులు తొలగించారు. శనివారం సాయంత్రం మండల పరిషత్, పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో వంతెనను తొలగింపు చేపట్టారు. డ్రెయినేజీపై సుమారు రెండేళ్ల క్రితం ఒక వ్యక్తి సొంతంగా వంతెన నిర్మించాడు. దీని వల్ల వర్షాకాలంలో వరదనీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, నీరు ముందుకు వెళ్లక అంబేడ్కర్ సెంటర్ ఏరియా పూర్తిగా ముంపునకు గురవుతున్నట్టు గతంలో ఆ ప్రాంత ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వరద ముంపు సమస్యను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా డ్రెయినేజీలోని మట్టిని తొలగించి వంతెన తొలగింపు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజారావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, గోపాలపురం ఎస్సై పి.మనోహర్, దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్ వంతెనను పరిశీలించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్ మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన కారణంగా వరదనీరు ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడి ఎస్సీ ఏరియా, అంబేడ్కర్ సెంటర్ ప్రాంతం ముంపుకు గురయిందన్నారు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజలు వంతెన తొలగించి ముంపు నుంచి కాపాడాలని పంచాయతీకి ఫిర్యాదు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. దీనిపై వంతెన నిర్మించిన తొలగించాలని వంతెన నిర్మించిన వ్యక్తికి నోటీసు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. నోటీసుకు సమాధానం ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తుతో వంతెన వంతెనను తొలగించినట్టు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు, గ్రామ పెద్దలు

ఉండ్రాజవరం: తాడిపర్రు ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం కె.సరోజిని, ఉపాధ్యాయులు వై.వెంకటస్వామి, వి.భానురేఖ, ఎం.పట్టాభి, జి.రవికాంత్‌ను శాలువా, మెమొంటో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. వీరితో పాటు పాఠశాలకు బదిలీపై వచ్చిన హెచ్ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.తాతారెడ్డి, ఆర్.ఫణి, కె.గీతా శైలజ, డి.అజిత్ కుమారిని ఘనంగా ఆహ్వానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.నరేంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.